

లైంగిక దాడి ఘటనపై దిశ డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని మలకాంలో చిన్నారిపై లైంగిక దాడి ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు దిశ డిఎస్‌పి శ్రీనివాసరావు బుధవారం విచారణ చేపట్టారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఈ ఘటనపై నివేదిక కోరడంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఈ కేసుపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన ఈ ఘటనలో దిశ డిఎస్‌పి శ్రీనివాసరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పలువురిని విచారణ చేసి సమాచారాన్ని సేకరించారు. నిందితుడు గతంఓనూ ఇటువంటి ఘటనలకు పాల్పడినట్లు పలువురు డిఎస్‌పికి తెలిపారు.


పోస్టల్ బ్యాలెట్ ఓట్లే కీలకం

- గత ఎన్నికల్లో వైసిపికే అధిక శాతం ఓట్లు
- టిడిపి గెలిచిన చోటా వైసిపి అభ్యర్థులకే ఆధిక్యం
- ఉద్యోగులు ఈసారి ఎవరిని కరుణించేనో?

హోరాహోరీ పోటీ నెలకొన్న ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అత్యంత కీలకం కానున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ శాతం ఈసారి అధికంగా నమోదు కావడంతో, ఓట్లు ఎవరికి పోలయ్యాయనే అంశంపై చర్చ సాగుతోంది. ప్రభుత్వంపై ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం ఉందని, అధిక శాతం ఓట్లు తమకే పడతాయని టిడిపి అంచనాలు వేస్తోంది. తమకూ ఉద్యోగులు ఓటేశారని వైసిపి నమ్ముతోంది. 2019 ఎన్నికల్లో మాత్రం వైసిపికే అధిక శాతం ఓట్లు పోలయ్యాయి. టిడిపి గెలిచిన ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాల్లో సైతం వైసిపి అభ్యర్థులకే పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఆధిక్యం లభించింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ కోసం 25,505 మంది దరఖాస్తు చేసుకోగా 22,797 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితోపాటు రక్షణ రంగంలో పనిచేస్తున్న 15,512 మంది సర్వీసు ఓటర్లు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. వీరంతా ఏ పార్టీ వైపు మొగ్గు చూపారన్న అంశంపై చర్చ నడుస్తోంది. అధిక శాతం ఓట్లు తమకే దక్కుతాయని టిడిపి ఆశలు పెట్టుకుంది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం ఉండడమే కారణమని వారు అంచనా వేస్తున్నారు. ఇందుకు అనేక ఉదాహరణలను ఉటంకిస్తున్నారు. వీటిలో సిపిఎస్ రద్దు, పిఆర్‌సి, ఐఆర్ ప్రధానమైన సమస్యలు. తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీనిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆ తర్వాత మాట మార్చారు. సిపిఎస్ రద్దు సాధ్యం కాదని, దాని స్థానంలో జిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చారు. సిపిఎస్ కంటే జిపిఎస్ ప్రమాదకరమైందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎస్ రద్దు కోసం అనేక పోరాటాలు సాగించారు. ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదాలతో ఆందోళనలూ చేశారు. ఆ ఆందోళనలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని గుర్తు చేస్తున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎట్టి పరిస్థితుల్లోనూ వైసిపికి ఓటేయరని వారు బలంగా నమ్ముతున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఓట్లు తగ్గినా సచివాలయ ఉద్యోగులు, వారి కుటుంబాలు తమకే ఓటేశారని వైసిపి ధీమా వ్యక్తం చేస్తోంది.



గత ఎన్నికల్లో ఇలా...

2019 ఎన్నికల్లో చెల్లుబాటైన 14,144 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో వైసిపికి 9,347 ఓట్లు వచ్చాయి. టిడిపికి 4,797 ఓట్లు దక్కాయి. వైసిపి 66 శాతం ఓట్లను సంపాదించింది. టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో టిడిపి గెలిచినా, అక్కడా వైసిపి అభ్యర్థులకే ఆధిక్యం లభించింది. టెక్కలిలో టిడిపి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు విజయం సాధించినా, అక్కడ వైసిపి అభ్యర్థి పేరాడ తిలక్‌కు అధిక ఓట్లు పోలయ్యాయి. టిడిపి అభ్యర్థికి 1032 ఓట్లు రాగా, వైసిపికి 1344 ఓట్లు వచ్చాయి. ఇచ్ఛాపురంలో టిడిపి అభ్యర్థి బెందాళం అశోక్ గెలిచినా, అక్కడా వైసిపి అభ్యర్థి పిరియా సాయిరాజ్‌కు ఎక్కువ ఓట్లు దక్కాయి. టిడిపి అభ్యర్థికి 587 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థికి 916 ఓట్లు వచ్చాయి.

పోస్టల్ బ్యాలెట్లపై టిడిపి ప్రత్యేక జాగ్రత్తలు

పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో తమకే అధిక శాతం పడతాయని భావిస్తున్న టిడిపి, వాటి చెల్లుబాటుపై ప్రత్యేక దృష్టిసారించింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల చెల్లుబాటుపై ఇప్పటికే టిడిపి ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం జిల్లా ఎన్నికల అధికారులకు పలు సూచనలతో ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. బ్యాలెట్ పేపర్ వెనుక ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఒ) సంతకమున్నా, సీల్ లేదని తిరస్కరించకూడదని స్పష్టం చేసింది. బ్యాలెట్ డిక్లరేషన్‌పై గెజిటెడ్ అధికారం సంతకం ఉంటే సీల్ లేకపోయినా తిరస్కరించవద్దని సూచించింది. ఓటరు తమ ఓటును బ్యాలెట్ పేపర్‌లో సక్రమంగా వేశారా? లేదా? అని మాత్రమే చూడాలని స్పష్టం చేసింది. అందుకనుగుణంగా జిల్లా ఎన్నికల అధికారులు ఆర్ఒలు, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

గెలుపోటములపై ప్రభావం

జిల్లాలో హోరాహోరీ పోరు ఉన్న నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రభావం ఉండవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. ప్రధానంగా జిల్లాలో శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో టఫ్ ఫైట్ నెలకొందన్న చర్చ నడుస్తున్న నేపథ్యంలో ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీతో గట్టెక్కుతారనే చర్చ నడుస్తోంది. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కీలకంగా మారనున్నాయి.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

కౌంటింగ్ బాధ్యత సూపర్‌వైజర్లదే...

- ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి
- లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతి నిషేధం
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశంలో సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఓట్ల లెక్కింపు సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్ల రెండో విడత శిక్షణా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కచ్చితమైన, సమర్థవంతమైన ఓట్ల లెక్కింపునకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతో సిబ్బందిని సన్నద్ధం చేయడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించిన సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల నిర్వహణ స్ఫూర్తితో ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రంలో పిఒకు ఎంత బాధ్యత ఉందో, అంతే బాధ్యత ఓట్ల లెక్కింపు కేంద్రంలో సూపర్‌వైజర్లపై ఉందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఓట్ల లెక్కింపు కేంద్రంలో పనిచేయాల్సి ఉంటుందని, ఎటువంటి సొంత నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపులో ఏదైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్‌కు విధులు కేటాయించిన సిబ్బంది అందరూ జూన్ నాలుగో తేదీన ఉదయం ఆరు గంటలకు ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాలను పలు బ్లాక్‌ల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి సెగ్మెంట్‌లో ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏ సమస్య వస్తే వెంటనే ఆర్ఒకు తెలియజేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఇవిఎంలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత బెల్ కంపెనీ ఇంజినీర్లు అందుబాటులో ఉంటారని వెంటనే వారికి తెలియజేయాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఆర్ఒలు, ఎన్నికల పరిశీలకులు మాత్రమే సెల్‌ఫోన్లు తీసుకెళ్లవచ్చని, మిగిలిన అధికారులు, సిబ్బంది కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదని స్పష్టం చేశారు.

సెల్‌ఫోన్స్ కోసం ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్‌గా ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఇటిబిపిఎస్), ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం), ఓటరు వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్స్ (వివి ప్యాట్) వంటి పలు అంశాలపై కౌంటింగ్ సూపర్‌వైజర్‌లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్‌లు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇవిఎంలు, పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి, ఫారం 13ఎ, 13బి, 13సి, 17సికి సంబంధించి, కౌంటింగ్ ప్రక్రియలో పాటించాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. శిక్షణా తరగతుల్లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ ఎం.వెంకటేశ్వరరావు, నోడల్ అధికారి ఎన్.బాలాజీ, మాస్టర్ ట్రైనర్లు శేషగిరి, మెప్మా పీడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

29న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని అన్ని కోర్టుల్లో జూన్ 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా వెల్లడించారు. జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయాధికారుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 16న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో పోలీసులు ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేశారని, అదే స్ఫూర్తితో వచ్చే లోక్ అదాలత్‌లో మరిన్ని కేసులు రాజీ చేయాలని సూచించారు. పోలీసులు వ్యక్తిగత శ్రద్ధ వహించి ప్రతి కక్షిదారునికి లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. కేసుల రాజీ వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించాలని సూచించారు. వ్యయ, ప్రయాసలను తగ్గించుకునేందుకు రాజీ దోహదపడుతుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయితే పోలీస్ యంత్రాంగానికి పెద్ద కేసులపై దృష్టిసారించే అవకాశం ఉంటుందన్నారు. సాధ్యమైన మేరకు రాజీ పడదగిన చిన్న కేసులన్నీ జాతీయ లోక్ అదాలత్ వేదికగా రాజీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లాలోని అదనపు జిల్లా న్యాయమూర్తులు పి.భాస్కరరావు, మహేంద్ర ఫణికుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అదనపు ఎస్‌పి ఉమామహేశ్వరరావు, డిసిఆర్‌బి సిఐ సోమశేఖర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తంగి శివప్రసాద్, సుశీల, ఉషాకిరణ్, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న లోకో, అసిస్టెంట్ లోకో పైలెట్లు

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

లోకో, అసిస్టెంట్ లోకో పైలెట్ల ధర్నా

ప్రజాశక్తి - పలాస

ఖాళీగా ఉన్న లోకో పైలెట్, అసిస్టెంట్ లోకో పైలెట్ల పోస్టులను భర్తీ చేయాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోషియేషన్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోషియేషన్ ఆధ్వర్యాన లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు పలాస రైలు నిలయం ఆవరణలో బుధవారం ధర్నా చేపట్టారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో, ప్రసుత్తం పనిచేస్తున్న వారిపై పనిభారం పడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యల పరిష్కారానికి రైల్వేశాఖ ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. గతంలో 120 కిలోమీటర్ల దూరం పనిచేస్తే రిలీవ్ చేయడంతో తమకు ఇబ్బంది ఉండేది కాదన్నారు. నేడు 12 గంటల పాటు పనిచేయిస్తోందని చెప్పారు. లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లకు తొమ్మిది గంటల పని అనంతరం రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. తమ విధి నిర్వహణ పూర్తయి మార్గమధ్యంలో ఎక్కడైనా దిగితే అక్కడ కనీస మౌలిక సదుపాయాలు ఉండవని చెప్పారు. కష్టాలు పడుతూనే తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో పలాస కేంద్రం పరిధిలోని లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

1 నుంచి నూతన మోటారు వాహన చట్టం

- మైనర్లు వాహనాలు నడిపితే రూ.25 వేలు జరిమానా
- మద్యం సేవించి వాహనం నడిపితే 6 నెలల జైలు, రూ.10 వేల అపరాధ రుసుము
- ఎస్‌పి జి.ఆర్ రాధిక



ప్రజాశక్తి - శ్రీకాకుళం

రహదారి, ట్రాఫిక్ నియమ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సవరించిన కొత్త చట్టం జూన్ ఒకటో తేది నుంచి అమల్లోకి రానుందని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. మైనర్లయిన పిల్లలకు వాహనాలను ఇస్తే కొత్త నిబంధనల మేరకు జరిమానాతో పాటు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. రోడ్డు నియమ నిబంధనలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రోడ్డు నియమాలను పాటించకుంటే భారీ జరిమానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రాణం చాలా విలువైందని, కొద్దిపాటి నిర్లక్ష్యం వహించినా కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగుల్చుతుందని పేర్కొన్నారు. పోలీసుల కోసం కాకుండా మీ కోసం మీ ప్రాణాలను కాపాడుకోవడం కోసం హెల్మెట్లు, సీటు బెల్టు వేసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ లైసెన్స్ తీసుకున్నాకే వాహనాలను నడపాలని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలను ఇస్తే తల్లిదండ్రులు, సంరక్షకులకు రూ.25 వేల జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధించనున్నట్లు తెలిపారు. తాగి వాహనాలు నడిపితే రూ.పది వేల జరిమానా విధించడంతో పాటు ఆరు నెలల జైలుశిక్షను విధిస్తామని పేర్కొన్నారు. రోడ్లపై కార్లలో సురక్షితంగా ప్రయాణించాలంటే సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సంకేతాలను పాటించాలని, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని తెలిపారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రతకు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో భద్రతా ఏర్పాట్లను బుధవారం ఆమె పర్యవేక్షించారు. జూన్ నాలుగో తేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు వచ్చే ఏజెంట్లు, పోటీ చేసిన అభ్యర్థుల ప్రవేశ మార్గాలు, వాహనాల పార్కింగ్, కౌంటింగ్ కోసం నిర్దేశించిన ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎటువంటి ట్రాఫిక్ ఆటంకాలు లేకుండా క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట అదనపు ఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పిలు వై.శృతి, ఎల్.శేషాద్రినాయుడు, సిఐలు, ఎస్‌ఐలు ఉన్నారు.



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్‌పి రాధిక



విలేకరులతో మాట్లాడుతున్న రవికుమార్

కూటమి విజయం తథ్యం

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

జూన్ నాలుగో తేదీన వెలువడనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమి విజయం తథ్యమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని రాపాకలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమన్నారు. వైసిపి ప్రభుత్వంలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని గ్రహించిన ఓటర్లు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేశారని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగల నాయకుడు చంద్రబాబు నాయుడు అని అన్నారు.

గత ఎన్నికల్లో ఒక్క ఛాన్స్ అంటూ అడిగిన జగన్, అధికారంలోకొచ్చాక రాష్ట్రాన్ని రెండు దశాబ్దాలు వెనక్కి తీసుకెళ్లేలా పాలన సాగించారని విమర్శించారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలపైనా భారాలు మోపారన్నారు. సంక్షేమం పేరిట ఇచ్చిన దానికి పది రెట్లు ప్రజల నుంచి లాక్కున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో చేసిన తప్పు పునరావృతం కాకుండా ప్రజలు కూటమికి పట్టం కట్టనున్నారని చెప్పారు. ఆయన వెంట తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్, టిడిపి నాయకులు కె.అప్పలనాయుడు, కండాపు శ్రీను, గొల్లయ్య, జనసేన మండల అధ్యక్షులు వై.రమణ, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేసవి వినోదం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వేసవి సెలవుల్లో టివి, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయి చదువుకు, మానసిక పరిపక్వతకు చిన్నారులు దూరమవుతున్నారని క్రియేటివ్ చిల్డ్రన్స్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు అన్నారు. అందుకు భిన్నంగా చిన్నారులను ఒక్కచోటుకు చేర్చి వారి మధ్య పోటీతత్వం పెంచాలన్న ఆలోచనతో వేసవి వినోదం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వేసవి వినోదం కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు పోటీలు నిర్వహించారు. పదేళ్ల లోపు 65 మంది చిన్నారులు పాల్గొనగా, వారి మధ్య పలు ఆటపాటల పోటీలు పెట్టారు. ఏకాగ్రతను పెంచేందుకు దోహదపడే లెమన్ అండ్ స్పూన్ పోటీలు ఆకట్టుకున్నాయి.





ఎన్‌టిఆర్ బంగారు నంది అవార్డులతో కళాకారులు

కళాకారులకు నంది అవార్డులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కీర్తిశేషులు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ పద్మశ్రీ నందమూరి తారక రామారావు 101వ జయంతిని పురస్కరించుకొని శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ వ్యవస్థాపకులు జి.కృష్ణ ఆధ్వర్యంలో 28న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి హైదరాబాద్ నందు జరిగిన ఎన్టీఆర్ స్మారక అవార్డ్స్ సర్వ నంది అవార్డు కార్యక్రమంలో ఇచ్ఛాపురం కళాకారులు బంగారు నంది అవార్డులు అందుకున్నారు. ఇచ్ఛాపురానికి చెందిన గాయకరత్న వెంకటేశ్వర పట్నాయక్ (చిన్నా గురు స్వామి) శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నాట్య గురువు శ్రుతి పట్నాయక్ దత్తి కావ్య, నీలాపు శైలు, సిల్లా పూజశ్రీ, చాట్ల విజయలక్ష్మి, ఆసిపు శ్వేతారాణిలు అందుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు టిడిపి మాజీ కేంద్రమంత్రి డాక్టర్ ఎస్.వేణుగోపాలచారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ చీఫ్ విప్ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, మాతాజీ నాగదేవత ఉపాసకులు విశిష్ట అతిథి అలీ ఖాన్, నటులు, నిర్మాత, సామాజికవేత్త మా అసోసియేషన్ సభ్యులు చేతులమీదుగా ఈ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, కళాకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ అవార్డు రావడం ఎంతో ఆధ్యాత్మికమని చిన్న గురుస్వామి దంపతులతో పాటు చిన్నారులు, వారి తల్లిదండ్రులు, కళాకారులు, గ్రామస్తులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



మెమొంటోను స్వీకరిస్తున్న ప్రసాద్

అరసవల్లిని సందర్శించిన నీరభ్ కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని బుధవారం రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎనర్జీ ఫారెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ నీరభ్ కుమార్ ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల అనంతరం అనివెట్టి మండపంలో స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి జ్ఞాపికను ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు అందజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కిశోర బాలికల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అక్కుపల్లి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్ వైజర్ యు.లత అన్నారు. బుధవారం మెట్టూరులో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలు నెలసరి సమయంలో సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రోటీన్లు ఎక్కువగా ఉండే శాకాహార, మాంసాహారం ఏదైనా తీసుకోవచ్చు అన్నారు. నెలసరి సమయంలో నీరు ఎక్కువగా తాగాలని, దాని వలన నెలసరి నొప్పి సమస్యలు ఉండవని సూచించారు. అంతర్గత దుస్తులు విషయంలో ప్రత్యేక శ్రద్ధ, పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకరంగా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ జోగారావు, రైతులు

సాగునీటి పైపులైను మరమ్మతులు

ప్రజాశక్తి- సోంపేట

పైడిగం ఛానల్ నుంచి సోంపేట, పలాసపురం, జింకిభద్ర తదితర గ్రామాలకు సాగునీటిని అందించే పైపులైన్ మరమ్మతు పనులను బుధవారం పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, రైతులు చేపట్టారు. తెలుకల గెడ్డ వద్ద ఉన్న పైపులైన్ మరమ్మతులకు గురి కావడంతో దిగువనున్న బూరగం, పలాసపురం, జింకిభద్ర, బేంకిలి, సోంపేట గ్రామాల్లోని పంట పొలాలకు సాగునీరు అందక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తడక జోగారావుతో పాటు రైతులు మరమ్మతు పనులు చేపట్టారు.



సత్కరిస్తున్న వాకర్స్

జుంబా డాన్స్‌మాస్టర్‌కు సత్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్య సంరక్షణకు జుంబా డాన్స్ ఎంతో ఉపయోగపడుతుందని, వయసుతో నిమిత్తం లేకుండా ప్రతిఒక్కరూ ఈ డాన్సు ద్వారా ప్రయోజనం పొందడానికి దోహద పడుతుందని డాన్స్ మాస్టర్ బత్తుల దేవీప్రసాద్ అన్నారు. బుధవారం నగరంలోని పిఎస్ఎన్ స్కూల్‌లో ఆదిత్య వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆయనను సత్కరించారు. వాకర్స్ సంస్థల రీజనల్ కౌన్సిల్ మెంబర్ పిజి గుప్తా చేతులమీదుగా ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత దేవీ ప్రసాద్ మాట్లాడుతూ చురుకైన ఫిట్నెస్ కోసం జుంబా డాన్స్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ బరువు తగ్గటానికి, కొవ్వును కరిగించే ఏకైక సాధనం జుంబా డాన్స్ అన్నారు. శరీరంలో రక్త ప్రసరణ సక్రమంగా జరగటానికి మేలు చేస్తుందని, రక్తంలో ఆక్సిజన్ స్థాయిని మెరుగుపర్చడానికి ఉపయోగపడే ఏకైక సాధనమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కింతలి సాయి కృష్ణ, సెక్రటరీ గారయ్య, ట్రెజరర్ బూర్లి రామకృష్ణ, సభ్యులు పాణిగ్రహి పండా, రాణి, దండి సాజన్య, అప్పన్న, ఎస్.హరిప్రియ, టి. జగదీష్, టి.ఉపేంద్ర, వి.సుధ తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన పారిశుధ్య సామగ్రి

- మట్టిలో కలుస్తున్న ఇనుప సామగ్రి
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీ పారిశుధ్య నిర్వహణకు ఉపయోగించే సామగ్రి అధికారుల నిర్లక్ష్య ధోరణితో మట్టిలో కలిసిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల్లో చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన ఇనుప డబ్బాలు ప్రస్తుతం కొన్ని మాత్రమే వినియోగంలో ఉండగా మరికొన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని తడి చెత్త, పొడి చెత్తను పట్టణ శివారులో ఉన్న జగ్గుశాస్త్రుల పేట డంపింగ్ యార్డ్‌కు రవాణా చేసే వాహనాలు మరమ్మతులకు గురై మోనింగివారి వీధిలో ఉన్న మున్సిపాలిటీ వాహనాల యార్డ్‌లో గత కొంతకాలంగా పడి ఉన్నాయని, వీటిని పట్టించుకోకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నారని పట్టణ ప్రజలు పలువురు ఆరోపిస్తున్నారు. లక్షల రూపాయల విలువ చేసే మున్సిపల్ ఆస్తులు మట్టి గర్భంలో కలిసిపోతున్నాయని పట్టణ ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు రవాణా చేసే ట్రాక్టర్లు, టిప్పర్లు, చిన్నపాటి బుల్డేజర్లు ఉన్నప్పటికీ కొన్ని ట్రాక్టర్లు చిన్నపాటి మరమ్మతులతో తుప్పుపడుతున్నాయి. పెద్ద మొత్తంలో మున్సిపాలిటీకి నష్టం వాటిల్లు తున్నప్పటికీ వాటిని పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నా రన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే అవే వాహనాలకు మరమ్మతుల పేరిట అధిక మొత్తంలో బిల్లులు డ్రా చేసి సొమ్ము చేసుకొని కొంత మంది అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని పలు ఆరో పణలు వినిపిస్తున్నాయి. 23 వార్డులో పారిశుధ్య నిర్వహణకు కేవలం మూడు ట్రాక్టర్లు, ఒక కాంపాక్టర్ వాహనం మాత్రమే వినియోగంలో ఉండడం వలన పారిశుధ్య నిర్వహణ కష్టతరమవుతుందని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. ప్రతిరోజు చెత్త సేకరణ పూర్తిస్థాయిలో నిర్వహించడానికి పారిశుధ్య కార్మికులు అష్టకష్టాలు పడుతు న్నప్పటికీ శానిటరీ మేస్త్రిలుగా వ్యవహారి స్తున్న పారిశుధ్య కార్మికులు, హెల్త్ అసిస్టెంట్‌తో పలు ఇబ్బందులు, అవమా నాలు ఎదుర్కొంటున్నామని పారిశుధ్య మహిళా కార్మికులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డిగ్రీ కళాశాల మైదానంలో వృథాగా పడి ఉన్న చెత్త డబ్బాలు

చెత్తడబ్బాలు అందుబాటులో లేక

తుప్పు పట్టి శిథిలమైన చెత్త డబ్బాల స్థానంలో కొత్త చెత్త డబ్బాలు వార్డుల్లో ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు చెత్తాచెదారాన్ని డబ్బాలు అందుబాటులో లేని కారణంగా కొంతమంది రహదారి ప్రక్కన, మరి కొంతమంది చూసి చూడనట్లు డ్రైనేజీలో వేస్తున్న సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. మున్సిపాలిటీలో నివాసం ఉంటున్న కుటుంబాలకు ఏడాదికి వివిధ రూపాల్లో వేస్తున్న పన్నులతో పాటు ఇటీవల చెత్త పన్నును కూడా వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు పట్టణంలో సరైన పారిశుధ్య నిర్వహణ చేపట్టడంలో విఫలమవుతున్నారని ప్రజా సంఘాల నాయకులు అధికారుల తీరుపై మండి పడుతున్నారు. ముఖ్యంగా గతంలో వినియోగంలేని వాహనాలు, ఇతర ఇనుప సామాగ్రిని ప్రకటనల ద్వారా వేలం వేసి విక్రయించి మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చే వారని ప్రస్తుతం అటువంటి విధానాలకు మంగళం పాడి నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి సమాచారం లేకుండా గుట్టుచప్పుడుగా సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తుప్పు పట్టి మట్టిలో కలిసిపోతున్న పారిశుధ్య చెత్త డబ్బాలు, వాహనాలు, ఇతర సామాగ్రిని పరిరక్షించి మున్సిపల్ ఆస్తులను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మూలకు చేరిన పారిశుధ్య ట్రాక్టర్ ట్రక్కులు

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా శిబిరాలు



శ్రీకాకుళం అర్బన్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తిరుపతిరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వేసవి సెలవుల్లో విద్యార్థులు పుస్తకంలోని అంశాలతో పాటు సమాజంపై అవగాహన పెంచుకోవాలని రిసోర్స్‌పర్సన్ తిరుపతిరావు సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు సమాజంలో వ్యవహరించాల్సిన బాధ్యతలు, సమాజం నుంచి నేర్చుకోవాల్సిన అంశాలపై అవగహన కల్పించారు. అలాగే పుస్తక పఠనం ప్రాముఖ్యతను, గణిత శాస్త్రంలో సులభమైన రీతిలో నేర్చుకునేందుకు పలు సూచనలు చేశారు. ఈ శిబిరంలో గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్ రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పివి భాస్కరరాజా తదితరులు పాల్గొన్నారు.

లావేరు: విద్యార్థులు దినపత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలని రిసోర్స్ పర్సన్ ఎం. శ్రీనివాసరావు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 30 మంది విద్యార్థులతో తెలుగు దినపత్రికలను చదివించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జూన్ 6 వరకు నిర్వహించి 7వ తేదీన విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్నామని స్థానిక గ్రంథాల యాధికారి ఆర్.అనురాధ తెలిపారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయులు మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసారు. గ్రంథాలయాధికారిణి బి.రూపావతి ఆధ్వర్యంలో నిర్వహించిన సహయకురాలు అమ్మనమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



టెక్కలి : క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాతపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం మాథ్స్ అసిస్టెంట్ పెద్దింటి ఆనందరావు 'మ్యాజిక్ మాథ్స్'పై తెలియజేశారు. 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ బి.బెనర్జీ, గ్రంథాలయాధికారి క్షాళ్ల రాజు పాల్గొన్నారు.

పక్కాగా మెనూ అమలు చేయాలి



కోటబొమ్మాళి : వంట పదార్థాలను పరిశీలిస్తున్న ఎంఇఒలు

ప్రజాశక్తి- కవిటి

మరికొద్ది రోజుల్లో పాఠశాలలు తెరుచుకోనున్నాయని, ప్రతి పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణంలో ప్రభుత్వం రూపొందించిన మెనూ పక్కాగా అమలు చేయాలని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి సూచించారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఎండిఎం వంట మనుషులు, సహాయకులకు ఒక్కరోజు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రత కలిగిన ఆహారం అందించాలనే లక్ష్యంతో పని చేయాలని సూచించారు. అదే విధంగా వంటశాల, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకుని, వంటల్లో నాణ్యమైన వస్తువులు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. మల్లేశ్వరరావు, డిఆర్‌పి ఆర్. రాము, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మధ్యాహ్న భోజన తయారీ మెనూ ప్రకారం వండాలని, రుచికరంగా తయారు చేయాలని, వంటగది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎంఇఒలు ఎస్. అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్‌లు మధ్యాహ్నభోజన నిర్వాహకులకు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్లు కృష్ణారావు, వి.లక్ష్మి, సిఆర్ఎంటిలు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కవిటి : మాట్లాడుతున్న ఎంఇఒ



చిట్టివలసలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రవికుమార్

రవికుమార్ పరామర్శ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొర్లకోట, చీమలవలస, బొబ్బిలిపేట, చిట్టివలస, మున్సిపాలిటీ పరిధిలోని బొడ్డేపల్లిపేట, కొత్తకోటవారి వీధిలో ఆయన పర్యటించి పలు కుటుంబాలను టిడిని ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ బుధవారం పరామర్శించి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనపై విసుగు చెందిన ప్రజలు ఎన్‌డిఎ కూటమిపై నమ్మకంతో ఓటు వేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో కూడా ప్రజలు తనను ఆదరించారని దీంతో తన గెలుపు నల్లేరు మీద నడకగా మారిందన్నారు. ఎన్నికల ఫలితాల రోజు టిడిపి నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామాల్లో ఎటు వంటి వివాదాలకు పోకూడదని రవికుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి గుజ్జల లక్ష్మణరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

నౌపడ: సంతబొమ్మాళి మండల ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు రెండు రోజుల క్రితం గుండెపోటుతో అస్వస్థతకు గురై శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలిసిన వెంటనే టెక్కలి నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఎంపిపి మేరుగ రాజేశ్వరి అప్పారావు దంపతులకు పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరపున తోడుగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయనతో పాటు పిఎసిఎస్ అధ్యక్షులు కిల్లి గోవింద్, మండల వైసిపి అధ్యక్షులు కోత సతీష్, ఆర్‌హెచ్ పురం ఎంపిటిసి సవర రాజు, టెక్కలి ఎంపిపి ప్రతినిధి, జిల్లా ఎస్‌సి సెల్ జనరల్ సెక్రెటరీ ఆట్ల రాహుల్ కుమార్ తదితరులు పరామర్శించారు. టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి ఫోన్‌లో మాట్లాడి అప్పారావు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



అప్పారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

మొదటి వారంలో మొక్కలు నాటే కార్యక్రమం



మాట్లాడుతున్న వెంకట వరప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో భవిష్యత్‌లో భానుడి ప్రతాపానికి గురి కాకుండా ఉండేందుకు జూన్ నెలలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడతామని జిల్లా ఉద్యానవనాల శాఖాధికారి రత్నాల వెంకట వరప్రసాద్ అన్నారు. బుధవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆయన జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో వర్షాలు ఆరంభం కానున్నాయని, ఆసమయంలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. ఉద్యానశాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రాణ వాయువును ఇచ్చే మొక్కలు వేసవి తాపాన్ని కొంత వరకు నివారించ వచ్చన్నారు. కార్యక్రమంలో స్టార్‌వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు, ఇందిరా ప్రసాద్, గుప్తా, గుడ్ల సత్యనారాయణ, రవి శంకర్, బత్తుల దేవీ ప్రసాద్, డాక్టర్ జి. నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

భూసార పరీక్షలను రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త అనూష అన్నారు. బుధవారం మండలంలోని నిమ్మతొర్లాడలో కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనూష మాట్లాడుతూ భూసార పరీక్షల అవశ్యకత, భూసార పరీక్షలు చేసుకోవడం వలన పెట్టుబడులను ఎలా తగ్గించుకోవచ్చు తదితర అంశాలను వివరించారు. భూసార పరీక్షలకు మట్టి నమూనాలు ఎలా తీసుకోవాలో తెలియజేశారు. అలాగే పచ్చిరొట్ట ఎరువులు, వాటి ఉపయోగాలు, భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు ఏ విధంగా వేసుకోవాలన్న అంశాలను తెలియజేశారు. రిలయన్స్ ఫౌండేషన్ తమ సొంత ఖర్చులతో నిమ్మతొర్లాడలో ఉచితంగా భూసార పరీక్షలు చేసి రైతులకు అందజేస్తామని రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది కిషోర్, ఆదర్శ రైతులు కృష్ణారావు, మధు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, కృష్ణారావు పాల్గొన్నారు.



భూసార పరీక్షల కోసం సేకరిస్తున్న మట్టి నమూనాలు



నిలిచిన వాహనాలు

ట్రాఫిక్‌తో అవస్థలు

ప్రజాశక్తి- కవిటి

కవిటి బజారు వీధిలో ట్రాఫిక్ తిప్పలు స్థానికులను వేధిస్తున్నాయి. ముఖ్యంగా బజారు వీధి మలుపులో ఓవైపు పళ్లు, పూలు విక్రేతలు ఉంటే, మరోవైపు బజారుకు వచ్చే వాహనాలు, ఆటోలు రోడ్డుపైనే నిలిపి వేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ ఉదయం వేళల్లోనే భారీ వాహనాలతో వ్యాపారులకు సామగ్రి లారీలతో వస్తుండడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మరికొద్ది రోజుల్లో పాఠశాలలు, కళాశాలలు తెరుచుకోనున్నాయి. అప్పటికీ ఈ సమస్య పరిష్కారం కాకపోతే విద్యార్థులకు ఇబ్బందులు తప్పవని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా ఉదయం వేళల్లో వస్తున్న భారీ వాహనాలు, రోడ్డుపైనే నిలిపివేస్తున్న వాహనాలతో తీవ్రమైన సమస్యలు పడుతున్నట్టు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు చెబుతున్నారు. దీనికి పాఠశాలల వాహనాలు తోడైతే మరింత ట్రాఫిక్ ఏర్పడుతుందని వీరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు ఈ సమస్యపై దృష్టిసారించి పరిష్కారమార్గం చూపించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



పరిశీలిస్తున్న పోలీసులు

బెజ్జిపురంలో చోరీ

లావేరు: మండలం బెజ్జిపురంలో చోరీ జరిగింది. చోరీలో భాగంగా 16.1/2 తులాల బంగారం, రూ.17వేలు నగదును అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన తాళాబత్తుల శ్రీను బాబు సోమవారం ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి విజయనగరం జిల్లా ఎస్.కోటలో గ్రామదేవత పండుగలకు తమ కుమార్తె ఇంటికి వెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చి చూడగా మేడపై ఉన్న గదిలో బీరువా బద్దలు కొట్టి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. వెంటనే లావేరు పోలీసులకు భాధితుడు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న జెఆర్‌పురం సిఐ రామచంద్రరావు, ఎస్ఐ స్వామి నాయుడు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్‌టీం సంఘటనా స్థలాన్ని క్షుణంగా తనిఖీ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఇంట్లో చోరీ జరగడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని లక్కపురంకు చెందిన రేగాన ఆనందరావు పూరిల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు బాధితులను కలిసి పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడు ఆనందరావు ప్రమాదం కారణంగా ఇంట్లో ఆరు తులాల బంగారం, రూ.40 వేలు నగదు అగ్నికి ఆహుతయ్యాయని తెలిపారు. తక్షణసాయం కింద నిత్యావసర సరుకులను అందించారు. ఈయనతో మండల ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, తోట అప్పలరాజు, కేత సాయికుమార్, మన్మథరావు, మణికంఠ, లోకేష్, మహేష్, రాంబాబు తదితరులున్నారు.

దరఖాస్తులు పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు పరిశీలన జూన్ 1 నుంచి 6 వరకు జరపనున్నట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను గురువారం పాఠశాల వద్ద ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జాబితాలో ఉన్న విద్యార్థులు తమ స్టడీ రికార్డుతో పాటు మూడు పాస్‌ఫోటోలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల జిరాక్స్, రికార్డ్ షీటు, ప్రవేశ దరఖాస్తుతో హాజరుకావాలన్నారు.

ఔదార్యం

టెక్కలి: మండలంలోని నర్సింగపల్లిలో రాంబాబు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన గసుకుండి అప్పలస్వామి పట్ల తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. బుధవారం అప్పలస్వామికి రూ.11వేలు ట్రస్టు నుంచి అందజేసినట్టు నిర్వాహకులు ఎన్ని షన్ముఖరావు తెలిపారు. అప్పలస్వామి అనారోగ్యంతో భాదపడుతున్న క్రమంలో చేయూతగా అందించామని నిర్వాహకులు తెలిపారు.

వృద్ధాశ్రమంలో సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థి దశ నుంచి ప్రతిఒక్కరూ సేవా దృక్పదం అలవర్చుకోవాలని స్వచ్ఛంద సేవకులు సుప్రజా రౌతు, గిరిజాల మహాలక్ష్మి, డా. ఆర్. శ్రావని సూచించారు. బుధవారం నగరంలోని బొందిలీపురంలో ఖ్యాతి వృద్ధాశ్రమాన్ని వారు సందర్శించారు. రణస్థలం మండలం కృష్ణాపురంకు చెందిన ఎంఎస్‌సి విద్యార్థి చదువుతూ సామాజిక సేవలో తనవంతు పాత్ర పోషించి, నిత్యావసర సరుకులను అందించటం మంచి విషయమని, మనమంతా విద్యార్థి లింగాల సాయి కుమార్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శ్రీకాకుళంలో సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు గిరిజాలా మహాలక్ష్మి, నవీన్, మదర్స్ లవ్ ఫౌండర్ సుప్రజా రౌతు, శివతేజలు నిరంతరం పేదలకు సాయపడుతున్నారని ఖ్యాతి ఫౌండేషన్ నిర్వహకురాలు డాక్టరు శ్రావణి వివరించారు. సాయమందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈతతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈత ద్వారా గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు దరి చేరకుండా ఉండవచ్చని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా స్విమ్మింగ్ అసోషియేషన్ అధ్యక్షులు కెఎన్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. వేసవి సెలవులు కాడంతో పెద్దసంఖ్యలో చిన్నారులు ఈత నేర్చుకునేందుకు స్విమ్మింగ్‌పూల్‌కు వస్తున్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను అసోషియేషన్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. బుధవారం స్విమ్మింగ్ శిబిరాన్ని శాంతినగర్ కాలనీలో ఉన్న స్మిమ్మింగ్ పూల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈతవలన శరీరంలో అన్ని అవయ వాలకు వ్యాయామం ఉంటుందని, దీనివలన చురుకు దనం కలిగి ఉంటారన్నారు. రక్త ప్రసరణ క్రమ బద్ధీకరణ, గుండె, ఊపిరితిత్తుల్లో కదలిక ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోచ్ ఎం.మురళి చిన్నారులకు స్విమ్మింగ్‌లో మెలకువలు నేర్పించారు.

ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- కవిటి

తమ సామాజిక తరగతి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్ కోసం తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని బెంతు ఒరియాలు స్పష్టం చేశారు. తమ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 154వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమ సామాజిక తరగతికి గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బెంతులకు గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.